కొత్త పింఛన్‌తో ఆసరా

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన సాగిస్తున్నారు. అన్ని వర్గాల ప్రజలు ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందులు పడకుండా అనేక పథకాల ద్వారా అండగా నిలుస్తున్నారు. ఇందులో భాగంగా వైఎస్సార్ పెన్షన్ కానుక ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు మొదలగు లబ్ధిదారులకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేస్తూ ఆసరాగ ఉంటున్నారు.

- 50, 51, 53 వార్డుల్లో 153 మందికి మంజూరు
- లబ్ధిదారుల్లో ఆనందం
- సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు


51వ వార్డులో కొత్త పింఛన్ లబ్ధిదారులతో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


50వ వార్డులో లబ్ధిదారులకు పెన్షన్ అందిస్తున్న కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్

మర్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. ప్రభుత్వం ఎప్పటికప్పుడు నూతన పెన్షన్లు అందజేస్తూ పేదలకు ఆర్థికంగా భరోసా కల్పిస్తోంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల తలుపు తట్టి పింఛన్ సొమ్ము చేతిలో పెడుతూ వారి కళ్లల్లో ఆనందం చూస్తోంది. జీవీఎంసీ 50,51,53 వార్డుల్లో ఈ నెలలో 153 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేశారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో తమకు ఆర్థికంగా భరోసా లభించిందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

50వ వార్డులో 48 మందికి..

ఈ వార్డులోని ఏడు సచివాలయాల పరిధిలో 48 మందికి కొత్తగా పింఛన్లు మంజూరయ్యాయి. వారిలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు ఉన్నారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ చేతుల మీదుగా వార్డు కార్యాలయంలో కొత్త లబ్ధిదారులకు పింఛన్ నగదు పంపిణీ చేశారు.

51వ వార్డులో 66 మందికి..

ఈ వార్డులోని మొత్తం ఆరు సచివాలయాల్లో కలిపి 66 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేశారు. కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ చేతుల మీదుగా వార్డు కార్యాలయంలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు.

53వ వార్డులో 39 మందికి..

ఈ వార్డులోని నాలుగు సచివాలయాల పరిధిలో 39 మందికి నూతన పింఛన్లను కార్పొరేటర్ బర్కత్ అలీ చేతుల మీదుగా అందజేశారు. ఈ మూడు వార్డుల్లో కొత్త పెన్షన్లు పొందిన వారంతా తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక భరోసా కల్పించారు



నా భర్త 2021లో మరణించారు. అప్పుడు పింఛన్ కోసం దరఖాస్తు చేశాను. కొన్ని కారణాల వల్ల కొంత ఆలస్యమైంది. ఇప్పుడు మంజూరైంది. కార్పొరేటర్ చేతుల మీదుగా వితంతువు పింఛన్ అందజేసి ఆర్థిక భరోసా కల్పించారు. ఆనందంగా ఉంది.

– ఎం.గోవిందమ్మ, మురళీనగర్, 50వ వార్డు

వెంటనే పెన్షన్ మంజూరైంది



నాకు 60 ఏళ్లు నిండటంతో వృద్ధాప్య పింఛన్ కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నాను. వెంటనే పెన్షన్ మంజూరైంది. ఈ నెల 1న పింఛన్ సొమ్ము అందజేశారు. సచివాలయ వ్యవస్థ బాగా పనిచేస్తోంది. సిబ్బంది, వలంటీర్లు సహకరిస్తున్నారు.

– రాపర్తి కొండబాబు, రాజీవ్‌నగర్ కాలనీ, 51వ వార్డు

ధైర్యంగా ఉంది

నా భర్త మరణించాక ప్రభుత్వం అందిస్తున్న వితంతువు పెన్షన్‌కు దరఖాస్తు చేసుకున్నాను. ఈ నెల 1న కార్పొరేటర్ బర్కత్ అలీ చేతుల మీదుగా పింఛన్ నగదు అందజేశారు. ఇప్పుడు ధైర్యంగా ఉంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– మహమ్మద్ ముంతాజ్ బేగం, మసీద్ స్ట్రీట్, 53వ వార్డు

ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం

నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు


జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బీపీ టెస్ట్ చేయించుకుంటున్న కె.కె.రాజు

సీతమ్మధార: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా.. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజక వర్గ సమన్వయకర్త కె.కె.రాజు తెలిపారు. జీవీఎంసీ 14వ వార్డులో శనివారం ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారు. సీతమ్మధారలోని తన ఇంటి వద్ద కె.కె.రాజు, కార్పొరేటర్ కటారి అనిల్‌కుమార్ రాజులకు ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు బీపీ, సుగర్ టెస్ట్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి భారం లేకుండా ఉచితంగా వైద్య సేవలందించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఐదు విడతలుగా ఈ కార్యక్రమం జరుగుతుందని.. మొదటి దశలో ప్రతి ఇంటినీ సందర్శించడం, రెండో దశలో ఉచిత వైద్య టోకెన్లు అందించడం, మూడో దశలో వలంటీర్లు, వైద్య సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఎటువంటి వైద్యం చేయించాలన్నది గుర్తించడం, నాలుగో దశలో మెడికల్ క్యాంప్ నిర్వహించి అవసరమైన వారందరికీ వైద్యం చేయించడం, ఐదో దశలో ప్రతీ క్షణం పర్యవేక్షించడం వంటివి చేస్తారని వివరించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్ర మంలో అందరూ బాధ్యతగా వ్యవహరించి పేషెంట్ సంతృప్తికి అధిక ప్రాధాన్యమివ్వాలని కె.కె.రాజు సూచించారు.

ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం


మహిళకు టోకెన్ అందిస్తున్న బర్కత్ అలీ, గుజ్జు వెంకటరెడ్డి

మర్రిపాలెం: ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని 53వ వార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ అన్నారు. వార్డులోని హుస్సేన్ నగర్‌లో శనివారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వేలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. 300 సచివాలయం పరిధిలో ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి బీపీ, సుగర్, హిమోగ్లోబిన్ టెస్టులు చేశారు. అనంతరం బర్కత్ అలీ మాట్లాడుతూ ఇంతవరకు ఏ ప్రభుత్వం ఉచిత వైద్య పరీక్షలు, మందులు ఇంటింటికీ వెళ్లి ఇచ్చే కార్యక్రమం చేపట్టలేదన్నారు. ఇంతటి మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. గుజ్జు వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అనంతరం తదుపరి చికిత్స కోసం స్థానికులకు టోకెన్లు అందజేశారు.

అథ్లెటిక్స్ పోటీల విజేతలకు అభినందనలు


విజేతలను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఇటీవల గుంటూరులో ఏలూరు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన 36వ ఆంధ్రప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. 800 మీటర్ల నుంచి 5 వేలు, 10 వేల మీటర్ల వరకు వివిధ అంశాల్లో జరిగిన రేసులో విద్యార్థులు పలు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా శనివారం విజేతలు వి.జ్యోతి దుర్గ, బి.కరుణశ్రీ, డి.చైతన్య దీపిక, ఎ.హేమలత, బి.కిరణ్‌కుమార్, బి.హర్షవర్ధన్, ఒ.కౌశిక్‌లను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గణనాథుడికి పూజలు


రేసపువానిపాలెంలో గణపతి సన్నిధిలో కె.కె.రాజు, పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెంలో ఎంవీ బాయ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నసమారాధనలో పాల్గొని భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వెంకన్నకు విశేష పూజలు


వెంకన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, తులసీదళ బిల్వార్చనలు నిర్వహించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవుడికి సుప్రభాత సేవ

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఉదయం నుంచి బాలభోగం, శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాదగోష్ఠి, సామూహిక విష్ణు సహస్రనామార్చన, రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం జరిపారు. సాయంత్రం ఆకాశ దీపారాధన, విశేష హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ


దుప్పట్లు అందిస్తున్న మహిళా వాకర్స్

మురళీనగర్: ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో శనివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. మెహర్ బాబా ధ్యాన మందిరం సమీప కాలనీలో నివసిస్తున్న పేద వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత, ఉపాధ్యక్షురాలు సిహెచ్.వరలక్ష్మి, పూర్వ అధ్యక్షురాలు శిరీష, కోశాధికారి సిహెచ్.లక్ష్మి, అఫ్సర్ ఖాన్, నాగేశ్వరి పాల్గొన్నారు.

నేడు వాకర్స్ క్యాబినెట్ సమావేశం

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్–101 నాలుగో క్యాబినెట్ సమావేశం మురళీనగర్ వర్మా కాంప్లెక్స్ సమీపంలోని జయరామ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తామని మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు జయప్రభా శర్మ తెలిపారు. వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అరీనా వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ డీడీ నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. వాకర్స్ ప్రతినిధులందరూ ఈ సమావేశానికి హాజరుకావాలని ఆమె కోరారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డులో శనివారం సాయంత్రం దోమల నిర్మూలనకు మలేరియా సిబ్బంది మెగా ఫాగింగ్ చేశారు. 80 ఫీట్ రోడ్, నారాయణ స్కూల్, జీవీఎంసీ స్కూల్ లైన్, పట్టణ ఆరోగ్య కేంద్రం, భారత్ గ్యాస్, పద్మశ్రీ ఆస్పత్రి, కమల్ ఆర్కేడ్, రమ్య అపార్ట్‌మెంట్ ప్రాంతాల్లో ఫాగింగ్ నిర్వహించారు.

వెంకట కృష్ణయ్యకు నివాళి

సీతంపేట: ప్రముఖ కవి, ప్రసన్న భారతి సాహిత్య పత్రిక సంపాదకుడు, విశాఖ సాహితి గౌరవాధ్యక్షుడు ఆచార్య పొన్నపల్లి వెంకట కృష్ణయ్య సంస్మరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. పత్రికా నిర్వాహకుడు కొండేపూడి సర్వేశ్వర ప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కోలవెన్ను పాండురంగ విఠల్‌మూర్తి, భాగవతుల కృష్ణారావు, డి.వి.సూర్యారావు, మేడా మస్తాన్‌రెడ్డి, లక్ష్మీపతి, చింతా ప్రభాకర్ తదితరులు వెంకట కృష్ణయ్య ప్రతిభా విశేషాలు, పత్రిక నిర్వహణకు అందించిన సహాయ సహకారాలను వివరించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

గుండె సమస్యలపై అప్రమత్తం


వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు, వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: గుండె సంబంధిత సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని అపోలో ఆస్పత్రి గుండె వ్యాధి నిపుణుడు డాక్టర్ పి.రాజేష్ అన్నారు. మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో అపోలో ఆస్పత్రి సహకారంతో వాకర్స్ పార్కులో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో స్థానికులకు ఆయన పలు సూచనలిచ్చారు. సుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవడం, వంటకాల్లో నూనె తగ్గించుకోవడంతోపాటు వేపుళ్లు, జంక్ ఫుడ్స్‌కు స్వస్తి చెప్పాలన్నారు. వాకింగ్, వ్యాయామం చేయడం వల్ల కండరాలు చురుగ్గా ఉండి బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటును కొంత వరకు నివారించవచ్చని చెప్పారు. కీళ్లు, ఎముకల వ్యాధి నిపుణుడు డాక్టర్ చందూ వంశీకృష్ణ మాట్లాడుతూ వృద్ధులు ఎముకల సాంద్రతకు సంబంధించి పరీక్షలు చేయించుకుని వైద్యుల సలహా మేరకు కాల్షియం మాత్రలు, నియమిత ఆహారం తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డాక్టర్ జి.లావణ్య వివరించారు.

206 మందికి వైద్య పరీక్షలు

ఉదయం 6 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన వైద్య శిబిరంలో 206 మందికి మధుమేహం, బీపీ పరీక్షలు చేశారు. వైద్యులను సత్కరించి జ్ఞాపికలు అందించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి ఎల్.వి.సుధాకర్, పూర్వాధ్యక్షులు ఎస్.బుచ్చయ్య, రాళ్లపల్లి సత్యనాథం, చిలకపాటి కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడు ఆదిభట్ల రామకృష్ణ, జాలీవాకర్ ఎన్.ప్రకాశరావు, సంయుక్త కార్యదర్శి ఎస్.సీతారామకృష్ణ, వడ్డాది అప్పారావు, బి.సూర్యనారాయణ, ఆర్.నాగేశ్వరరావు వైద్య శిబిరం నిర్వహణకు సహకరించారు.

యువకుడి ఆత్మహత్య


నవీన్ మృతదేహం

సీతమ్మధార: ప్రేమించిన యువతి పెళ్లికి నిరాకరించడంతో ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం సంతోషిమాత కాలనీలో చిరుత నవీన్(23) తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని నాలుగేళ్లుగా ప్రేమిస్తున్నాడు. వారం రోజుల కిందట పెళ్లి చేసుకుందామని అడగ్గా.. ఆమె నిరాకరించింది. మనస్థాపం చెందిన నవీన్ శుక్రవారం రాత్రి ఇంట్లో అందరూ పడుకున్న సమయంలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకున్నాడు. ఇంటి బయట నిద్రించిన తల్లి తెల్లవారుజామున లేచి చూసే సరికి విగత జీవిగా కొడుకు కనిపించాడు. శనివారం ఫోర్త్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఐ విజయ కుమార్, హెడ్ కానిస్టేబుల్ షణ్ముకరావు వచ్చి పరిశీలించారు. హెచ్‌సీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కమ్యూనిస్టులు దేశ భావనను రూపొందించాలి


ప్రసంగిస్తున్న డాక్టర్ రవిప్రకాష్ సిన్హా

సీతంపేట: వర్గ రాజకీయాల ప్రాతిపదికన దేశ భావనను రూపొందించేందుకు కమ్యూనిస్టులు మేధోమథనం చేయాలని న్యూ సోషలిస్టు ఇనీషియేటివ్ ప్రతినిధి డాక్టర్ రవిప్రకాష్ సిన్హా అన్నారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకుడు ఎం.వి.ఎస్.కపర్ది శత జయంతి సందర్భంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో 'భారతదేశ భావన – మార్క్సిస్ట్ దృక్పథం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. దేశ స్వాతంత్ర్యం అనంతరం లౌకిక, పౌరసత్వ భావజాలం.. హిందుత్వ భావజాలం ఆధారంగా రెండు రకాల జాతీయ వాదాలు ముందుకొచ్చాయన్నారు. హిందుత్వ జాతీయ వాదంపై క్రమంగా ఆకర్షణ పెరిగి 2014లో మోదీ కేంద్రంలో అధికారంలోకి వచ్చారని పేర్కొన్నారు. హిందుత్వ అతి జాతీయ వాదానికి వ్యతిరేకంగా వర్గ రాజకీయాల ప్రాతిపదికన దేశ భావనను రూపొందించాలని సూచించారు. భిన్న మతాలు, సంస్కృతుల కలయికతో కూడిన మన దేశంలో కమ్యూనిస్టులు దీని కోసం కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కార్మిక ఉద్యమంపై ఆచార్య కె.శ్రీనివాసులు, అసంఘటిత రంగ కార్మిక ఉద్యమాలపై ఆచార్య జి.విజయ్, ఐటీ రంగం కృత్రిమ మేధపై వై.కిరణ్ చంద్ర ప్రసంగించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కపర్ది కుమారుడు జగన్‌మోహనరావు, కుమార్తె అమ్మాజీ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

బీఐఎస్ హాల్‌మార్క్‌పై అవగాహన అవసరం


మాట్లాడుతున్న చదలవాడ బాబు

సీతమ్మధార: విద్యార్థి దశ నుంచే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎస్) హాల్‌మార్క్‌పై అవగాహన కలిగి ఉండాలని సీపీఐ జాతీయ వైస్ ప్రెసిడెంట్ చదలవాడ బాబు సూచించారు. సీతమ్మధార పీ అండ్ టీ కాలనీలోని జీవీఎంసీ హైస్కూల్‌లో శనివారం స్టాండర్డ్ క్లబ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఐఎస్ గుర్తు కలిగిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. ఈ మార్క్‌తో నాణ్యమైన భద్రత వస్తువులు మాత్రమే ఇస్తారని, కొనుగోలు విషయంలో వినియోగదారులకు సహాయకరంగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం రాంప్రసాద్, క్లబ్ గైడ్ నాగభూషణం, ఏపీ వినియోగదారుల సంఘాల సమైక్య కాప్కో రాష్ట్ర కార్యదర్శి హెచ్.ఎస్.రామకృష్ణ, మణిభూషన్, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

అతి పే..ద్ద అరటి గెల


ఎంవీపీ రైతుబజార్‌లో 300 పండ్లతో గెల

ఆరిలోవ: ఎంవీపీ రైతు బజార్‌కు శనివారం 300 పండ్లతో పెద్ద అరటి గెలను ఓ రైతు తీసుకొచ్చాడు. కోటవురట్ల మండలం విశ్వనాథపురం గ్రామానికి చెందిన శ్రీను అనే రైతు ఇక్కడ బజార్‌కు తీసుకొచ్చిన సుమారు మూడున్నర అడుగులకు పైగా పొడవున్న ఈ అరటి గెలకు 16 పెడలు ఉన్నాయి. దానికి సుమారు 300 అరటి పండ్లు ఉన్నాయి. సాధారణంగా అరటి గెలకు 7 నుంచి 10 వరకు పెడలు, 150 నుంచి 180 వరకు పండ్లు ఉంటాయి. సపోటా ముకిరీ అనే పిలిచే ఈ గెలకు మాత్రం 16 పెడలున్నాయి.

సీతంపేటలో మహా అన్నదానం


సీతంపేట దుర్గాగణపతి ఆలయం వద్ద భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు


దుర్గాగణపతికి పూజలు చేస్తున్న సత్యనారాయణ, సతీష్‌కుమార్ ఆర్య


ఇందిరానగర్-5లో భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న కె.కె.రాజు, నీలి రవి

సీతంపేట: వినాయక నవరాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా శనివారం 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో సీతంపేట కూడలిలోని దుర్గాగణపతి ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు కార్యక్రమాన్ని ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. దుర్గాగణపతి నవరాత్రి ఉత్సవాలను శోభాయమానంగా నిర్వహించిన ఆలయ కమిటీ ప్రతినిధులను ఆయన అభినందించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో సీతంపేట జంక్షన్ జనసంద్రంలా మారింది. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సుమారు 5 వేల మందికి అన్నదానం చేశారు. స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ ప్రతినిధులు చేసిన ఆర్థిక సాయంతో అన్నదానం నిర్వహించామని కార్పొరేటర్ గోవింద్ తెలిపారు. ఆలయ ఈవో రమాభాయి, కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్నదాతలకు సత్కారం

దుర్గాగణపతి నవరాత్రి ఉత్సవాలకు, మహా అన్నదాన కార్యక్రమానికి ధన సహాయం చేసిన స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ ప్రతినిధులను దుర్గాగణపతి ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో శనివారం అర్చకుడు నటరాజన్ చేతుల మీదుగా స్టీల్ సిటీ చైర్మన్ కె.సత్యనారాయణ, ఎండీ సతీష్ కుమార్ ఆర్యా, డైరెక్టర్లు పి.మధు, టి.వి.శ్రీకాంత్‌లను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ముందుగా వారి పేరున దుర్గాగణపతికి అర్చన చేశారు.

- గణేష్‌నగర్ యూత్ ఆధ్వర్యంలో స్థానిక గణేష్‌నగర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఉప్పాడ సన్నీ, వెంకటేష్, శివ, పండు, అప్పలరాజు, మధు, ఉదయ్, అశోక్ పాల్గొన్నారు.
- 26వ వార్డు అక్కయ్యపాలెంలో గణపతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన అన్నదానంలో కార్పొరేటర్ ముక్కా శ్రావణి, టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు.

48వ వార్డులో..

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు ఇందిరానగర్-5లో జైభారత్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనను ముఖ్య అతిథులు నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, 48, 49, 50 వార్డుల జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి నీలి రవి ప్రారంభించారు. కార్యక్రమంలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మి, అనసూయ, ఈశ్వరి పూర్ణిమ, విజయ, గోపి, భువన్, ఎర్నికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన గణేష్ ఉత్సవాలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు తాటిచెట్లపాలెంలో శ్రీ చక్ర బిల్డర్స్ ఆధ్వర్యంలో ప్రారంభమైన వినాయక నవరాత్రి మహోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఇక్కడ పర్యావరణ హితంగా ఏర్పాటు చేసిన గ్రీన్ గణేషుడి విగ్రహం అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నిర్వహించిన భారీ అన్నదానాన్ని వైఎస్సార్‌సీపీ 42వ వార్డు నాయకుడు ఆళ్ల శ్రీనివాస్ ప్రారంభించారు. సాయంత్రం వైభవంగా నిమజ్జనం కార్యక్రమం నిర్వహించారు.


గ్రీన్ గణేషుడి నిమజ్జన ఊరేగింపులో భక్తులు

ఆటో బోల్తాపడి ప్రయాణికుడికి గాయాలు

మర్రిపాలెం: ఓ వ్యక్తి ఆటోలో ప్రయాణిస్తుండగా ఒక్కసారిగా అది బోల్తాపడటంతో గాయాలైన ఘటన కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం ధర్మానగర్‌లో నివసిస్తున్న జి.గురుప్రసాద్ జాతీయ రహదారి ధర్మానగర్ వద్ద సర్వీస్ రోడ్డులో శనివారం ఉదయం ఆటో ఎక్కాడు. బిర్లా జంక్షన్ వద్దకు వచ్చేసరికి ఒక్కసారిగా ఆటో తిరగబడింది. దీంతో గురుప్రసాద్‌కు గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ఫిర్యాదు మేరకు సీఐ ఎస్.సాయి నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ సతీష్ కేసు దర్యాప్తు చేపట్టారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.16.28 లక్షలు

సీతమ్మధార: ఆశీలమెట్ట సంపత్ వినాయగర్ ఆలయంలో దేవదాయ శాఖ తనిఖీదారు బి.వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం హుండీ ఆదాయం లెక్కించగా 14 రోజులకు రూ.16.28 లక్షలు వచ్చాయి. బంగారం నాలుగు గ్రాముల 513 మిల్లీగ్రాములు, వెండి 172 గ్రాముల 700 మిల్లీగ్రాములు, ఇతర దేశాల డాలర్లు వచ్చినట్లు ఆలయ ఫౌండర్, ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్ తెలిపారు. శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.